సాక్షి
ఖమ్మం
మంగళవారం । 9 । జూలై । 2024



మరింత పారదర్శకంగా..
ప్రతీ వారం కలెక్టరేట్‌లో జరిగే గ్రీవెన్స్ డేలో మరింత పారదర్శకత తీసుకొచ్చేలా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ చర్యలు చేపడుతున్నారు. 8లో



గిరిజనేతరుల గోడు
తరతరాలుగా పోడు సాగు చేస్తున్న గిరిజనేతరులు తమకు సైతం పట్టాలు ఇచ్చి రక్షణ కల్పించాలని కోరుతున్నారు. 10లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
32° / 25°
జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

విదేశీ విద్యాపథకానికి దరఖాస్తు చేసుకోండి

ఖమ్మంమయూరిసెంటర్: విదేశాలలో ఉన్నత విద్యనభ్యసించే మైనార్టీ విద్యార్థులు(ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, జైనులు, పార్సీలు) ముఖ్యమంత్రి విదేశీ విద్యాపథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి ఎం.ఎ.మహమూదీ సూచించారు. డిగ్రీ(ఇంజనీరింగ్)లో 60 శాతం మార్కులు కలిగిన వారు పీజీ చేసేందుకు, పీజీలో 60శాతం మార్కులు వచ్చి డాక్టరేట్ చేయాలనుకునే వారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి జూలై 31 వరకు అమెరికా, కెనడా, బ్రిటన్, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, సింగపూర్, న్యూజిలాండ్, సౌత్ కొరియా దేశాల్లోని ఎంపిక చేసిన యూనివర్సిటీల్లో ప్రవేశాలు పొందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు ఆగస్టు 7వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా www.telanganaepass.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకుని, వాటి ప్రతులను కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

సైన్స్ మ్యూజియం పరిశీలన

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని జిల్లా సైన్స్ మ్యూజియంను డీఈఓ ఈ.సోమశేఖర శర్మ సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా మ్యూజియంలో ఏర్పాటుచేస్తున్న పరికరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు ఉపయోగపడే ప్రదర్శనలను అందుబాటులో తీసుకొస్తున్నామని డీఈఓ శర్మ తెలిపారు. ఇంకా ఈకార్యక్రమంలో జిల్లా సైన్స్ ఆఫీసర్ జగదీశ్వర్, ఏపీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గెలల క్రషింగ్

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేటలోని ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలో ఈనెల 10వ తేదీ నుంచి గెలల క్రషింగ్ పునఃప్రారంభిస్తున్నట్లు ఆయిల్‌ఫెడ్ డివిజనల్ అధికారి ఆకుల బాలకృష్ణ తెలిపారు. గెలల ఉత్పత్తి పెరిగిన నేపథ్యాన దమ్మపేట మండలం అప్పారావుపేట ఫ్యాక్టరీతోపాటు అశ్వారావుపేట ఫ్యాక్టరీలో కుడా క్రషింగ్‌కు నిర్ణయించినట్లు చెప్పారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని సూచించారు. కాగా టన్ను, అర టన్ను గెలలతో వచ్చే రైతులు ఇన్నాళ్లు అప్పారావుపేట ఫ్యాక్టరీకు తరలించేందుకు ఇబ్బంది పడగా, ఎట్టకేలకు అశ్వారావుపేటలో క్రషింగ్ ప్రారంభం కానుండడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆ పదవులు అధికారికం!



ముద్దా విజయ్‌బాబు


రాయల నాగేశ్వరరావు


పొదెం వీరయ్య


నాయుడు సత్యనారాయణ

నామినేటెడ్ పదవులపై జీఓ విడుదల
- కార్పొరేషన్ చైర్మన్లుగా ఉమ్మడి జిల్లాలో ఐదుగురికి అవకాశం
- గతంలోనే ప్రకటించినా జీఓ విడుదలలో ఆలస్యం
- ఎన్నికల కోడ్ ముగియడంతో ఇన్నాళ్లకు లైన్‌క్లియర్
- పదవుల కోసం ఇంకొందరు నేతల యత్నాలు



సాక్షి ప్రతినిధి, ఖమ్మం: కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఐదుగురు నేతలను కార్పొరేషన్ చైర్మన్ పదవులు వరించాయి. అయితే అప్పట్లో లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో అధికారికంగా జీఓ విడుదల కాలేదు. ప్రస్తుతం కోడ్ ముగియడంతో రాయల నాగేశ్వరరావు, ముద్దా విజయ్‌బాబు, పొదెం వీరయ్య, నాయుడు సత్యనారాయణ, నూతి శ్రీకాంత్‌కు కార్పొరేషన్ చైర్మన్ పదవులు కేటాయిస్తూ ఈ ఏడాది మార్చి 15 తేదీతో ప్రభుత్వం జీఓ జారీ చేసింది. ఈ పదవుల్లో వీరు రెండేళ్ల పాటు కొనసాగనుండగా.. మరిన్ని పదవులు భర్తీ అవుతాయన్న ప్రచారంతో ఉమ్మడి జిల్లాలోని ఆశావహులు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

జిల్లాకు ప్రాధాన్యత

దాదాపు పదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో తమకు తగిన గుర్తింపు దక్కాలని నాయకులు, కార్యకర్తలు ఆశించారు. అధికార పగ్గాలు చేపట్టాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో ఉన్న పలు కమిటీలను రద్దు చేయగా.. కాంగ్రెస్ నేతలకు వీటిని కట్టబెట్టేందుకు రంగం సిద్ధమైంది. దీంతో రాష్ట్రస్థాయిలో కొన్ని కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించగా.. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ దాదాపు క్లీన్‌స్వీప్ చేయడం, ముగ్గురు మంత్రులు ఉండడంతో తొలివిడతలోనే ఐదుగురికి పదవులు కేటాయించడం ద్వారా ప్రాధాన్యత కల్పించారు.

ఐదుగురికి పదవులు

లోక్‌సభ ఎన్నికలకు ముందుగానే ఉమ్మడి జిల్లాకు చెందిన రాయల నాగేశ్వరరావు, ముద్దా విజయ్‌బాబు, పొదెం వీరయ్య, నాయుడు సత్యనారాయణ, నూతి శ్రీకాంత్‌కు రాష్ట్రస్థాయిలో కార్పొరేషన్ పదవులు దక్కాయి. వీరిలో రాయల నాగేశ్వరావు పాలేరు అసెంబ్లీ టికెట్‌ను ఆశించి భంగపడగా.. ముద్దా విజయ్‌బాబు సైతం అసెంబ్లీ టికెట్‌ను ఆశించారు. ఇక భద్రాచలం నుంచి పొదెం వీరయ్య కాంగ్రెస్ తరఫున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. వీరితో పాటు పార్టీ నాయకులు నాయుడు సత్యనారాయణ, నూతి శ్రీకాంత్‌కు పదవులు ఇచ్చారు. ఇందులో రాయల నాగేశ్వరరావును తెలంగాణ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా, పొదెం వీరయ్యను తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా, ముద్దా విజయ్‌బాబును తెలంగాణ స్టేట్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా, నాయుడు సత్యనారాయణను తెలంగాణ స్టేట్ హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా, నూతి శ్రీకాంత్‌ను తెలంగాణ స్టేట్ బీసీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ఉత్తర్వులు మార్చి 15వ తేదీతో విడుదల కాగా, బాధ్యతల స్వీకరణకు మంచి ముహూర్తాలు చూసుకుంటున్నారు. ఇందులో రాయల నాగేశ్వరరావు మాత్రం ఈనెల 11న బాధ్యతలు తీసుకోవాలని ఇప్పటికే నిర్ణయించినట్లు తెలిసింది.

స్పీడ్ పెంచిన ఆశావహులు

గతంలోనే భర్తీ చేసిన పదవులకు సంబంధించి ఉత్తర్వులు విడుదల కావడంతో నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న ఇంకొందరు ఉమ్మడి జిల్లా నేతలు తమ ప్రయత్నాల్లో వేగం పెంచారు. జిల్లాకు చెందిన డిప్యూటీ సీఎం, రెవెన్యూ శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతోపాటు రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి, ఇతర నేతల ద్వారా ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

ఇంకా పోటీలో ఎవరెవరు?

సత్తుపల్లి ఎమ్మెల్యే భర్త, కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవి కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వైరా నియోజకవర్గం నుంచి బొర్రా రాజశేఖర్, కట్ల రంగారావు రాష్ట్రస్థాయి పదవుల కోసం తమ నేతలను కలుస్తున్నారు. ఇంకా భద్రాచలం నియోజకవర్గానికి చెందిన బుడగం శ్రీనివాస్, మధిర నియోజకవర్గం నుంచి వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మండడపు నాగేశ్వరావు, పసుపులేటి దేవేంద్రం, డాక్టర్ కోట రాంబాబు, ఐలూరు వెంకటేశ్వరరెడ్డి, పైడిపల్లి కిషోర్ పదవులు ఆశిస్తున్నారు. అలాగే, ఖమ్మం నియోజకవర్గం నుంచి జావేద్, కమర్తపు మురళి, సాధు రమేష్‌రెడ్డి, ముదిరెడ్డి నిరంజన్‌రెడ్డి, పినపాక నియోజకవర్గంలో తుళ్లూరి బ్రహ్మయ్య, బట్టా విజయ్, కొత్తగూడెం నియోజకవర్గం నుంచి పోట్ల నాగేశ్వరరావు, నాగ సీతారాములు, ఎడవల్లి కృష్ణ, ఇల్లెందు నియోజకవర్గంలో డాక్టర్ జి.రవి, మేకల మల్లిబాబుయాదవ్ నామినేటెడ్ పదవుల కోసం ఎదురుచూస్తున్న వారి జాబితాలో ఉన్నారు. దీంతో వీరిలో ఇంకా ఎవరెవరికి పదవులు దక్కుతాయనే ఆసక్తి నెలకొంది.

ప్రజల గుండెల్లో వైఎస్సార్ పదిలం...


కేక్ కట్ చేస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి, నాయకులు, ప్రజాప్రతినిధులు

- ఆయన చేసిన సేవలు మరువలేనివి
- జయంతి వేడుకల్లో ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మంవన్‌టౌన్/కూసుమంచి: అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలతో లబ్ధి చేకూర్చిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి అందరి గుండెల్లో పదిలంగా ఉంటారని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి తెలిపారు. వైఎస్సార్ జయంతి వేడుకలను ఖమ్మం, కూసుమంచిల్లోని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎంపీ కేక్ కట్ చేసి మాట్లాడారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, 108, ఉచిత విద్యుత్ తదితర పథకాలతో పేదల కలలను సాకారం చేసిన వైఎస్సార్ సాగునీటి ప్రాజెక్టులతో రైతన్నలకు అండగా నిలిచారని గుర్తు చేశారు. దివంగత మహానేత ఆశయసాధనకు పునరంకితమవుతూ ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఇతర మంత్రుల నేతృత్వాన ప్రజా సంక్షేమపాలన కొనసాగుతోందని తెలిపారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కూడా ఎంపీ తదితరులు వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఎంపీపీలు బానోతు శ్రీనివాస్‌నాయక్, మంగీలాల్, నాయకులు, ప్రజాప్రతినిధులు తుంబూరు దయాకర్‌రెడ్డి, దొబ్బల సౌజన్య, కొత్తా సీతారాములు, మలీదు వెంకటేశ్వర్లు, రాపర్తి శరత్, కొత్తపల్లి పుష్ప, ప్రతిభారెడ్డి, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, బొమ్మడి శ్రీనివాస్ యాదవ్, రామసహాయం మాధవీరెడ్డి, నల్లమల వెంకటేశ్వరరావు, కొప్పుల అశోక్, భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బాణాల లక్ష్మణ్, పద్మజారెడ్డి, మట్టె గురవయ్య, జూకూరి గోపాలరావు, ఎండీ.హఫీజుద్దీన్, ఎడవెల్లి రాంరెడ్డి, జొన్నలగడ్డ రవికుమార్, మాదాసు ఉపేందర్, కొమిరెల్లి అలింగ గోవిందరెడ్డి, బజ్జూరి వెంకటరెడ్డి, మంకెన వాసు తదితరులుపాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు

ఉమ్మడి జిల్లా అభివృద్ధికి ప్రణాళికాయుతంగా ముందుకు సాగుతానని ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి తెలిపారు. కూసుమంచిలోని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ యూనివర్సిటీలు, ఎయిర్‌పోర్టును ప్రాధాన్యతగా తీసుకుని వాటి ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అలాగే, పాలేరు రిజర్వాయర్‌ను వాటర్ స్పోర్ట్స్‌కు అనువుగా మార్చాలనే ఆలోచన ఉందని తెలిపారు.

రామయ్యకు ముత్తంగి అలంకరణ

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి మూలమూర్తులను ముత్తంగి రూపంలో అలంకరించగా, తిలకించిన భక్తులు పులకించిపోయారు. ప్రతీ సోమవారం స్వామివారిని ఈ రూపంలో అలంకరించడం దేవస్థానం ప్రత్యేకత. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

ఫిర్యాదులు పెండింగ్ ఉండొద్దు..

గ్రీవెన్స్ డేలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం సహకారనగర్: ప్రజావాణిలో అందే ఫిర్యాదులు, వినతిపత్రాలకు ప్రాధాన్యత ఇస్తూ పెండింగ్ ఉండకుండా పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి(గ్రీవెన్స్ డే)లో ఆయన అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్‌తో కలిసి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తులను ప్రాధాన్యతగా భావించి సత్వరమే పరిష్కరించాలన్నారు. కాగా, ధరణి సమస్యలపై అందిన దరఖాస్తులను కలెక్టర్ అక్కడికక్కడే పరిశీలించి పరిష్కారంపై తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్, డీఆర్డీఓ సన్యాసయ్య, జెడ్పీ సీఈఓ వినోద్, డీఆర్వో ఎం.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

గ్రీవెన్స్ డేకు ఎక్కువగా రెవెన్యూ అంశాలపైనే ఫిర్యాదులు అందగా.. పెన్షన్లు, సదరం సర్టిఫికెట్ల కోసం కూడా పలువురు వినతిపత్రాలు అందజేశారు. ఖమ్మం ఖానాపురానికి చెందిన భట్టు నాగమణి తనకు టేకులపల్లిలో డబుల్ బెడ్ రూమ్ కేటాయిస్తే భర్త అమ్ముకున్నాడని ఫిర్యాదు చేసింది. బోనకల్ మండలం రావినూతలకు చెందిన బి.మంగమ్మ సర్వే నంబర్ 152/32లో కొనుగోలు చేసిన భూమికి పాస్‌బుక్ మంజూరు చేయాలని, ముదిగొండ మండలం గంధసిరికి చెందిన జాలాది విద్యాసాగర్ తన భార్యను అంగన్‌వాడీ టీచర్‌గా నియమించాలని, తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలుకు చెందిన మాలోత్ బిగిని అగ్నిప్రమాదంలో కాలిపోయిన పట్టాదారు పుస్తకాల కాపీలు ఇప్పించాలని కోరారు. అంతేకాకుండా చింతకాని మండలం ప్రొద్దుటూరుకు చెందిన షేక్ జాన్ సాహెబ్ తనకు 75 శాతం అంగవైకల్యం ఉన్నందున ఆసరా పింఛన్, కొణిజర్ల మండలం పెద్దగోపతికి చెందిన మాచర్ల సైదమ్మ వితంతు పెన్షన్ మంజూరు చేయాలని వినతిపత్రాలు అందజేశారు.


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

మెరుగైన విద్య అందిద్దాం..

ఏన్కూరు: విద్యార్థులకు మెరుగైన విద్య అందించడం ద్వారా వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఉపాధ్యాయులకు సూచించారు. ఏన్కూరు మండలం హిమామ్‌నగర్‌లోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా తరగతి గదుల్లో సౌకర్యాలను పరిశీలించాక యూనిఫాం పంపిణీ, మధ్యాహ్న భోజనం అమలు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ద్వారా చేపట్టిన పనులపై ఉపాధ్యాయులతో ఆరా తీశారు. ఆతర్వాత తరగతి గదికి వెళ్లిన కలెక్టర్ విద్యార్థులతో పాటే నేలపై కూర్చుని వారి పుస్తకాలను పరిశీలిస్తూ విద్యాప్రమాణాలను పరీక్షించారు. పాఠం చదువుతూ వారితో చదివించిన ఆయన ప్రశ్నలు వేస్తూ సమాధానాలు రాబట్టి ఉత్సాహపరిచారు.


విద్యార్థుల సామర్థ్యాలు పరీక్షిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

సమస్యలపై సత్వరమే స్పందించాలి

- జిల్లా సమగ్రాభివృద్ధికి పక్కా ప్రణాళిక
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్‌తో మంత్రి తుమ్మల

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ప్రజల సమస్యలపై సత్వరమే స్పందిస్తూనే జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికాయుతంగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌తో సమావేశమయ్యారు. జిల్లాలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా సరఫరాలో సమస్యలను పరిష్కరించాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఇక జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాలను పకడ్బందీగా నియంత్రించాలని.. యువతకు మత్తు పదార్థాలు అందించే ముఠాలపై కఠినంగా వ్యవహరించాలని మంత్రి ఆదేశించారు. కాగా, కలెక్టరేట్‌కు వచ్చిన మంత్రికి పలువురు సమస్యలపై వినతులు అందజేయగా వాటిని కలెక్టర్‌కు అందజేసి త్వరగా పరిష్కరించాలని సూచించారు.

ఆగస్టు 15 కల్లా రైతు రుణమాఫీ

వేంసూరు: రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా రైతులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో వచ్చేనెల 15 నాటికి రూ.30 వేల కోట్ల మేర రుణ మాఫీ చేస్తామని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. వేంసూరు పీఏసీఎస్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన పెట్రోల్ బంక్‌ను సోమవారం ఆయన సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయితో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతు భరోసా దుర్వినియోగం కాకుండా సాగు భూములకే మంజూరు చేయాలని ఇటీవల సమావేశాల్లో రైతులు వెల్లడించగా, త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నివేదిక ఇస్తామని తెలిపారు. ఇక నెల రోజుల్లో వైరా రిజర్వాయర్, లంకాసాగర్‌కు గోదావరి జలాలు చేరుస్తామని, వచ్చే ఏడాది నాటికి వేంసూరు మండలానికి సైతం గోదావరి జలాలు అందుతాయని మంత్రి తెలిపారు. కాగా, వేంసూరు మండలంలో పామాయిల్ ఫ్యాక్టరీ పనులు ప్రారంభం కానున్నందున రైతులు పంట సాగుకు ముందుకు రావాలన్నారు. అనంతరం వేంసూరు వద్ద గ్రీన్ ఫీల్డ్ హైవేకు మంజూరైన ఎగ్జిట్ నిర్మాణ ప్రాంతాన్ని తుమ్మల పరిశీలించారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, డీసీసీబీ సీఈఓ అబీద్‌ఉర్ రెహమాన్, డీసీఓ ఖుర్షీద్, వేంసూరు పీఏసీఎస్ అధ్యక్షుడు తక్కెళ్లపాటి గోపాలకృష్ణ, నాయకులు పుచ్చకాయల సోమిరెడ్డి, కాసరి చంద్రశేఖర్‌రెడ్డి, వెల్ది జగన్‌మోహన్‌రావు, అట్లూరి సత్యనారాయణరెడ్డి, ఎండీ.ఫైజుద్దీన్, గంధ్ర సోమిరెడ్డి, కనమతరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, రావి సత్యనారాయణ, బండి వెంకటేశ్వరరెడ్డి, బొమ్మన బోయిన వెంకటేశ్వరరావు, మామిళ్లపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


వేంసూరులో పెట్రోల్ బంక్‌ను ప్రారంభించిన మంత్రి తుమ్మల, పక్కన ఎమ్మెల్యే రాగమయి తదితరులు

సీతారామ కాల్వకు తొలగిన అడ్డంకులు

ఏన్కూరు: సీతారామ కాల్వ నిర్మాణానికి అడ్డంకులు తొలగిన నేపథ్యాన త్వరలోనే నిర్మాణం పూర్తవుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరావు వెల్లడించారు. ఏన్కూరు మండలం హిమామ్‌నగర్‌లో జరుగుతున్న సీతారామ లింక్ కెనాల్ పనులను సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. గుజరాత్ చీఫ్ సెక్రటరీతో మాట్లాడడంతో అడ్డుగా ఉన్న గ్యాస్ పైప్‌లైన్ మార్చడానికి అనుమతించారని, ఇక ట్రయల్ రన్ పనుల కోసం చైనా నుండి సాంకేతిక నిపుణులు రానున్నారని తెలిపారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్, నాయకులు గుత్తా వెంకటేశ్వరావు, నల్లమల వెంకటేశ్వరావు, మేడ ధర్మారావు, వాసిరెడ్డి నాగేశ్వరావు, శోభన్‌నాయక్, పూర్ణకంటి మైసారావు పాల్గొన్నారు.

మూడు ముక్కలు మాకొద్దు..

- భద్రచలం విభజనపై స్థానికుల ఆగ్రహం
- ఆందోళన దిశగా పార్టీలు, భద్రాద్రి వాసులు

భద్రాచలం: 'ఉన్న నాలుకకు మందేస్తే.. కొండ నాలుక పోయింది' అన్నట్టుగా మారింది భద్రాచలం వాసుల పరిస్థితి. ఇక్కడి నుంచి విడదీసి ఏపీలో కలిపిన ఐదు పంచాయతీలను తిరిగి భద్రాచలంలో కలపాలనే అంశంపై ఇరు రాష్ట్రాల సీఎంల చర్చల్లో ఏం తేలుస్తారోనని స్థానికులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇంతలోనే భద్రాచలం మేజర్ పంచాయతీని మూడు జీపీలుగా విభజించే బిల్లుకు గవర్నర్ ఆమోదం లభించడం వారిని కలిచివేసింది. విభజనపై తమ అభీష్టాన్ని పరిగణనలోకి తీసుకోలేదనే ఆవేదన ప్రజల నుంచి వ్యక్తమవుతోంది.

మా గోడు పట్టదా..?

భద్రాచలాన్ని మూడుగా విభజించొద్దని కొంతకాలంగా స్థానికులు ఆందోళన చేస్తున్నారు. సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీలతో పాటు ఆదివాసీ సంఘాల నేతలు కూడా దీన్ని వ్యతిరేకించారు. కానీ అదే నిర్ణయం పునరావృతం కావడంతో వారంతా అగ్గిమీద గుగ్గిళం అవుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మూడు పంచాయతీలను ఒప్పుకోమని, ప్రజల అభీష్టానికి విలువ లేదా అని ప్రశ్నిస్తున్నారు. ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా దేశవ్యాప్తంగా ప్రాముఖ్యత ఉన్న భద్రాచలం గుర్తింపు మాయమయ్యేలా చేయడం సరికాదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భద్రాచలం దేవస్థానానికి ఉన్న ప్రాముఖ్యత దృష్ట్యా ప్రభుత్వం పునఃపరిశీలించి ఒకే పంచాయతీగా ఉంచాలని కోరుతున్నారు. లేదంటే గిరిజన, గిరిజనేతరులకు న్యాయం జరిగేలా, గిరిజన చట్టాలకు లోబడి స్పెషల్ అథారిటీ ప్రాంతంగా గుర్తించే విధంగా సమాలోచనలు చేయాలని విన్నవించుకుంటున్నారు.


భద్రాచలం గ్రామపంచాయతీ కార్యాలయం

ఇరకాటంలో కాంగ్రెస్ నాయకులు..

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ బిల్లును ప్రవేశపెట్టినప్పుడు గులాబీ నేతలు మినహా ఇతర పార్టీలన్నీ వ్యతిరేకించాయి. భద్రాచలం ఒకే పంచాయతీగా ఉండాలని కాంగ్రెస్‌కు చెందిన అప్పటి ఎమ్మెల్యే పొదెం వీరయ్య పోరాటం చేశారు. గవర్నర్‌తో పాటు మంత్రులను కలిసి విన్నవించారు. అయితే అదే కాంగ్రెస్ ప్రభుత్వం నేడు అధికారంలోకి రావడం, భద్రాచలం ఎమ్మెల్యేగా గెలిచిన తెల్లం వెంకట్రావ్ కాంగ్రెస్‌లో చేరడంతో ప్రస్తుతం భద్రాద్రి వాసులకు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులే సమాధానం చెప్పాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి తోడు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తుండడంతో విభజన అంశం కాంగ్రెస్‌కు ప్రధాన సమస్యగా మారేలా ఉంది. అయితే అసెంబ్లీ సమావేశాల్లో పంచాయతీరాజ్ చట్టానికి సవరణ చేసి గవర్నర్‌కు పంపి ఆమోదించొచ్చని న్యాయ నిపుణులు సూచిస్తున్నారు. మరి రాష్ట్ర ప్రభుత్వం మూడు పంచాయతీలుగా విభజిస్తుందా లేక భద్రాద్రి వాసుల అభీష్టం మేరకు ఒకే జీపీగా కొనసాగిస్తుందా అనేది తేలాల్సి ఉంది.

క్లుప్తంగా

రేపు జేఎల్ఎం ఎంపిక పరీక్ష

ఖమ్మంవ్యవసాయం: ఉమ్మడి జిల్లా పరిధిలోని జూనియర్ లైన్‌మెన్ల(జేఎల్ఎం) అభ్యర్థులకు బుధవారం ఎంపిక పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఖమ్మం ఎస్ఈ ఏ.సురేందర్ తెలిపారు. రెండు పోస్టుల భర్తీకి స్తంభం ఎక్కే పరీక్ష నిర్వహించడంతో పాటు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటికే అర్హులైన అభ్యర్థులకు సమాచారం ఇచ్చిన నేపథ్యాన వారు హాజరుకావాలని సూచించారు.

రేపు జాబ్ మేళా

ఖమ్మం రాపర్తినగర్: నిరుద్యోగ యువకుల కోసం టేకులపల్లిలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో ఈనెల 10న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖఅధికారి కొండపల్లి శ్రీరాం తెలిపారు. సత్య మైక్రో క్యాపిటల్ లిమిటెడ్ 100 ఖాళీలు ఉండగా, అప్రెంటిస్, ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులకు ఇంటర్ పూర్తిచేసి 18నుంచి 32 ఏళ్ల వయస్సు కలిగిన వారు అర్హులని వెల్లడించారు. ఆసక్తి ఉన్న తమ సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో బుధవారం ఉదయం 10 గంటలకు హాజరుకావాలని సూచించారు.

పాఠశాల విద్యార్థులకు ఐడీ కార్డులు, టై, బెల్ట్‌లు



విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

రఘునాథపాలెం: మండలంలోని పాటివారిగూడెం ప్రాథమిక పాఠశాలలో 1నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయుడు ఆర్.సాయిరాం ఐడీ కార్డులు, టై, బెల్ట్‌లు చేయించారు. ప్రైవేట్ పాఠశాలకు దీటుగా తమ పాఠశాల విద్యార్థులు ఉండాలనే భావనతో ఆయన సొంత ఖర్చుతో గుర్తింపు కార్డులు, టై, బెల్ట్‌లు సిద్ధం చేయించగా సోమవారం కామంచికల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు వాసిరెడ్డి జ్యోతి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం, గ్రామస్తులు సాయిరాంను అభినందించగా హెచ్‌ఎం మాట్లాడుతూ గతంలో ఇక్కడ పనిచేసిన సాయిరాం తిరిగి పదిహేనేళ్ల తర్వాత రావడం ఆనందం ఉందని తెలిపారు. ఆయన విధుల్లో చేరాక విద్యార్థుల సంఖ్య నాలుగు నుంచి 14కు చేరిందని పేర్కొన్నారు.

ఆలయంలో చోరీ

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని శ్రీవైద్యనాథ స్వామి దేవాలయంలో చోరీ జరిగింది. అర్చకులు పి.దివాకర్ తెలిపిన వివరాలు... ఆలయంలో ఆదివారం ఉదయం పూజలు నిర్వహించాక అర్చకుడు మధ్యాహ్నం తాళం వేసి వెళ్లిపోయాడు. తిరిగి సాయంత్రం వచ్చేసరికి తలుపులు తీసి ఉండడంతో పరిశీలించగా ఇన్వర్టర్ బ్యాటరీ, గంట దొంగిలించినట్లు తేలింది. దీంతో సోమవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యువకుడిని అడ్డగించి బైక్, ఫోన్...

ముదిగొండ: అర్ధరాత్రి వేళ ఓ యువకుడిని అడ్డగించి సెల్‌ఫోన్, ద్విచక్రవాహనం లాక్కెళ్లిన ఘటన ముదిగొండ మండలం వనంవారికిష్టాపురం సమీపాన చోటుచేసుకుంది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాలి ఉన్నాయి. కమలాపురానికి చెందిన ఎల్లాల రామాంజనేయులు ఖమ్మంలోని తన స్నేహితుడి పుట్టినరోజు వేడుకకు హాజరై ఆదివారం అర్ధరాత్రి దాటాక బైక్‌పై స్వగ్రామానికి వస్తున్నాడు. మార్గమధ్యలో వనంవారి కిష్టాపురంలోని ఓ ఫంక్షన్‌హాల్ సమీపాన ద్విచక్రవాహనంపై వచ్చిన ముగ్గురు వ్యక్తులు ఆయనను అడ్డుకుని బైక్, సెల్‌ఫోన్ లాక్కుని పరారయ్యారు. దీంతో అటూఇటు తిప్పలుపడి ఆయన స్వగ్రామానికి చేరుకోగా, రూ.2.50లక్షల విలువైన బైక్, ఫోన్ చోరీ అయిందని సోమవారం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దాడి కేసులో వ్యక్తి రిమాండ్

ఖమ్మంరూరల్: మండలంలోని గుర్రాలపాడులో భూతగాదా విషయమై తండ్రీకొడుకులపై గొడ్డలితో దాడి చేసిన బొర్రయ్యను సోమవారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ నెల 5న దాసరి వెంకటేశ్వర్లు, దాసరి బొర్రయ్య పొలం గట్టు విషయమై ఘర్షణ పడ్డారు. పక్కనే ఉన్న వెంకటేశ్వర్లు కుమారుడు సైదులు వెళ్లి ఆరా తీస్తుండగా ఆగ్రహించిన బొర్రయ్య.. వెంకటేశ్వర్లు, సైదులుపై గొడ్డలితో దాడి చేశాడు. దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా, నిందితుడు బొర్రయ్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

ఉరి వేసుకుని ఆశా కార్యకర్త ఆత్మహత్య



పుల్లమ్మ (ఫైల్)

బోనకల్: మండలంలోని రావిల్లికి చెందిన ఆశా కార్యకర్త ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. రావిల్లికి చెందిన గొల్లమందల పుల్లమ్మ(38) కొన్నేళ్ల నుంచి ఆశా కార్యకర్తగా పనిచేస్తోంది. మద్యానికి బానిసైన ఆమె భర్త బ్రహ్మంను ఎన్నిసార్లు హెచ్చరించగా తీరు మారకపోగా ఘర్షణ పడుతున్నాడు. ఆదివారం కూడా బ్రహ్మం మద్యం తాగొచ్చి ఆమెతో గొడవ పడడమే కాక రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయి పాఠశాలలో పడుకున్నాడు. సోమవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు ఇంటికి వెళ్లి తలుపులు తీసేసరికి పుల్లమ్మ ఇంట్లో చీరతో ఉరి వేసుకుని ఉంది. ఆయన ఇచ్చిన సమాచారంతో స్థానికులు, బంధువులు చేరుకుని పుల్లమ్మను కిందకు దించేసరికి ప్రాణాలు కోల్పోయింది. భర్త మద్యానికి బానిస కావడంతో వేధిస్తుండడంతోనే పుల్లమ్మ మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని గ్రామంలో చర్చ జరుగుతోంది.

మరింత పారదర్శకంగా...

- గ్రీవెన్స్‌సెల్ హాల్‌లో టీవీల తెరల ఏర్పాటు
- సులభంగా దరఖాస్తుల స్థితిగతుల పరిశీలన



ఫిర్యాదు వివరాలు నమోదు చేస్తుండగా కలెక్టర్ చూసేలా ఏర్పాటుచేసిన టీవీ



అధికారులకు సైతం ఫిర్యాదు స్థితి కనిపించేలా బిగించిన టీవీ స్క్రీన్లు

ఖమ్మం సహకారనగర్: పారదర్శకతకు పెద్దపీట వేసే దిశగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం జరిగే గ్రీవెన్స్ డే(ప్రజావాణి)లో మార్పులు తీసుకొచ్చారు. గతంలో ప్రజావాణికి వచ్చేవారు తమ వివరాలు నమోదు చేసుకున్నాక నేరుగా కలెక్టర్, ఇతర అధికారులకు అందించేవారు. ఆతర్వాత వీటిని శాఖల వారీగా అధికారులకు పంపించేవారు. అయితే, దరఖాస్తులు మధ్యలో ఎక్కడా తప్పకుండా కలెక్టర్, ఇతర అధికారుల వద్దకు వచ్చాక అక్కడ కూడా మరోమారు నమోదు చేయిస్తున్నారు. ఇదంతా అటు కలెక్టర్, ఇటు శాఖల వారీగా అధికారులకు కనిపించేలా గ్రీవెన్స్ డే జరుగుతున్న హాల్‌లో టీవీలు అమర్చారు. వీటిలో దరఖాస్తుల నమోదు వివరాలు, స్థితిగతులు ఎప్పటికప్పుడు కనిపిస్తుండడంతో అధికారులకు వెసలుబాటుగా ఉండగా, కలెక్టర్ తరచూ పర్యవేక్షించే అవకాశం ఏర్పడింది.

కలెక్టరేట్‌లో ధరణి హెల్ప్‌డెస్క్

రైతులు ఎదుర్కొంటున్న భూసంబంధ సమస్యలను పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగానే కలెక్టరేట్‌లో సైతం ధరణి హెల్ప్ డెస్క్(ధరణి సహాయ కేంద్రం) ఏర్పాటు చేశారు. కార్యాలయ పనివేళల్లో విధులు నిర్వర్తించేలా ఇక్కడ ఒక ఉద్యోగిని కేటాయించగా అటు గ్రీవెన్స్ డేతో పాటు ఇతర రోజుల్లోనూ ధరణి సమస్యలపై వచ్చే వారికి సలహాలు సూచనలు ఇస్తున్నారు.



ధరణి హెల్ప్‌డెస్క్...

ఈజీఎస్‌లో ఫీల్డ్ అసిస్టెంట్ 'మాయ'పై విచారణ

- మస్టర్లలో ఉద్యోగుల పేర్లపై కలెక్టర్ సీరియస్
- విచారణ చేపట్టిన అదనపు డీఆర్‌డీఓ

సాక్షి ఎఫెక్ట్..



ఉద్యోగుల నుంచి వివరాలు సేకరిస్తున్న అదనపు డీఆర్‌డీఓ శిరీష

కామేపల్లి: ఈజీఎస్ పథకం కింద చేపట్టిన పనుల్లో జరిగిన అవకతవకలపై అధికారులు తీగ లాగితే డొంక కదులుతోంది. కామేపల్లి మండలం బర్లగూడెంలో చేపట్టిన ఈజీఎస్‌లో పనుల్లో అవినీతి బయటపడిన నేపథ్యాన 'సాక్షి'లో సోమవారం 'ఈజీఎస్‌లో ఫీల్డ్ అసిస్టెంట్ల మాయలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ విచారణ చేపట్టి నివేదిక అందించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. మస్టర్లలో ప్రభుత్వ ఉద్యోగుల పేర్లు నమోదు చేసినట్లు తెలుసుకున్న ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో అదనపు డీఆర్‌డీఓ బి.శిరీష సోమవారం బర్లగూడెం చేరుకుని గ్రామపంచాయతీ కార్యాలయంలో పనుల వివరాలు పరిశీలించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యాలయంలోనే ఉన్న ఆమె ఈజీఎస్ పనులు, కూలీలకు చెల్లింపులు, మస్టర్లపై ఆరాతీశారు. ఈ సందర్భంగా స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ వారానికి రూ.వంద చొప్పున వసూలు చేశారని, ప్రభుత్వ ఉద్యోగుల పేర్లతో మస్టర్లు రాశారని, పశువుల షెడ్లు మంజూరు చేస్తానని పలువురి నుంచి డబ్బు వసూలు చేశారని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ విచారణలో ఏపీడీ వెంకటపతిరాజు, ఎంపీడీఓ రవీందర్, ఏపీఓ శ్రీరాణి తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యాయత్నం

- పొలం కట్టలు ధ్వంసం చేశారని మనస్తాపం
- ముదిగొండ మండలం బాణాపురంలో ఘటన



బాటిల్‌లో కలిపిన పురుగుల మందు తాగుతున్న సీతయ్య

ముదిగొండ: పొలంలో కట్టలను ధ్వంసం చేశారనే మనస్తాపంతో ముదిగొండ మండలం బాణాపురం పరిధిలో ఓ రైతు సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాలు... బాణాపురానికి చెందిన మేడి సీతయ్య, ఆయన తమ్ముళ్లు కమలాపురం రెవెన్యూ సర్వే నంబర్ 119, 167, 168, 170ల్లో ఐదెకరాల 37కుంటల భూమిని 2021లో కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అయితే, పొలం చుట్టూ కట్టలు పోసుకుని సాగు చేసుకుంటుంటే ఇటీవల కమలాపురం, బాణాపురానికి చెందిన కొందరు జేసీబీలతో వచ్చి నాశనం చేశారని సమాచారం. అంతేకాక చెరువు శిఖంలో కట్టలు పోయొద్దని ఐబీ అధికారులు చెబుతూ ఎత్తు తగ్గించాలని సూచించినట్లు తెలిసింది.

ఈక్రమంలోనే పోలీసులకు ఫిర్యాదు చేయగా, అధికారులు సర్వే చేసి పట్టా భూమి అని నిర్ధారించారని సీతయ్య కుటుంబీకులు తెలిపారు. ఆపై నెల పాటు పనులను అడ్డుకుంటున్నారని సమాచారం. ఇంతలోనే సోమవారం ఆయన పొలం చదును చేసే పనుల్లో నిమగ్నం కాగా కమలాపురానికి చెందిన కొందరు వచ్చి కులం పేరుతో దూషించడమే కాక పొక్లెయినర్ తగలబెడదామని బెదిరించారని సీతయ్య కుటుంబీకులు ఆరోపిస్తుంచారు. ఈక్రమంలోనే సీతయ్య పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో ఆయనను ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. కాగా, ఈ విషయమై ఐబీ డీఈ పెద్దరాంబాబును వివరణ కోరగా చెరువు శిఖంలో నిబంధనలకు విరుద్ధంగా జేసీబీ ద్వారా పెద్ద కట్టలు పోశారని తెలిపారు. దీంతో ఆరుగురు రైతులపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

రెండు గ్రామాల్లో పూర్తయిన సర్వే

9 మందికి మూత్రపిండాల సంబంధిత వ్యాధులు

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలం పుతానీతండా, సూర్య తండా గ్రామాల్లో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు చేపట్టిన సర్వే పూర్తయింది. ఈసందర్భంగా మూత్రపిండాల సంబంధిత వ్యాధులతో తొమ్మిది మంది బాధపడుతున్నట్లు తేలింది. పుతానీతండా గ్రామంలో ఓ వ్యక్తి చనిపోగా పరామర్శించేందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెళ్లారు. ఇక్కడ పలువురు వ్యాధులతో బాధపడుతున్నారని గ్రామస్తులు చెప్పడంతో పూర్తిస్థాయిలో సర్వే చేయాలని మంత్రి ఆదేశించారు. దీంతో డీఎంహెచ్ఓ మాలతి ఆధ్వర్యాన పుతానీతండాలో, మంచుకొండ పీహెచ్‌సీ డాక్టర్ బాలకృష్ణ ఆధ్వర్యాన సూర్యతండాలో చేపట్టిన సర్వే సోమవారం పూర్తయింది. కాగా, 770 జనాభా కలిగిన పుతానీతండాలో ఎనిమిది మంది, 450మంది జనాభా ఉన్న సూర్యతండాలో ఒకరు మూత్రపిండాల సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నట్లు గుర్తించగా, ఎక్కువ మంది నొప్పి నివారణకు ఆర్ఎంపీల సూచనతో మందులు వాడుతున్నట్లు తేలింది. ఈ నేపథ్యాన తాగునీటి నమూనాలు సైతం సేకరించగా నివేదిక రావాల్సి ఉందని అధికారులు తెలిపారు.

నిధుల స్వాహాపై విచారణ

ఖమ్మం సహకారనగర్: జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో కాంట్రాక్ట్ ఉద్యోగి చేతివాటం ప్రదర్శించి రూ.26లక్షలు స్వాహా చేసిన ఘటనపై అధికారులు విచారణలో వేగం పెంచారు. ఉద్యోగి రామకృష్ణకు సంబంధించి ఓ బ్యాంకు ఖాతా లావాదేవీలను పరిశీలించినట్లు సమాచారం. వివిధ పాఠశాలలకు సంబంధించిన నిధులు సైతం ఆయన డ్రా చేసి ఉండి ఉండొచ్చనే అనుమానంతో అప్రమత్తమైన అధికారులు ఆ దిశగా కూడా పరిశీలిస్తున్నారు. ఇదిలా ఉండగా స్కూల్ గ్రాంట్ నిధుల స్వాహాపై విచారణ కొనసాగుతోందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాధ్యులపై చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ తెలిపారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిపై కేసు

ఖమ్మంక్రైం: ఫోర్జరీ సంతకాలతో ప్రభుత్వ నిధులు కాజేసిన సమగ్ర శిక్షాభియాన్ విభాగం ఔట్ సోర్సింగ్ ఉద్యోగిపై సోమవారం ఖమ్మం త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. డీఈఓ కార్యాలయంలోని సమగ్ర శిక్షాభియాన్ విభాగం ఉద్యోగి రామకృష్ణ వివిధ పాఠశాలలకు ప్రభుత్వం నుంచి విడుదలైన రూ.1.82 కోట్లను ఫోర్జరీ సంతకాలతో తన ఖాతాకు బదిలీ చేసుకున్నట్లు గుర్తించారు. ఇందులో పెద్దమొత్తంలో నిధులు డ్రా చేసినట్లు తేలడంతో డీఈఓ ఫిర్యాదు మేరకు రామకృష్ణపై కేసు నమోదు చేశామని ఎస్ఐ సతీష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

చింతకాని: మండలంలోని జగన్నాథపురం సమీపాన సోమవారం రాత్రి ద్విచక్ర వాహనం చెట్టుకు ఢీకొట్టిన ఘటనలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. యువకుడు సాయి ఖమ్మం నుంచి బైక్‌పై చింతకానికి వెళ్తుండగా జగన్నాథపురం సమీపాన వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆయన తీవ్రంగా గాయపడడంతో ఎస్సై నాగుల్‌మీరా, బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు చేరుకుని 108లో ఖమ్మం తరలించారు. సాయి స్వగ్రామం ఏపీలోని నందిగామ కాగా ప్రస్తుతం ఖమ్మంలో నివాసముంటున్నాడు.

స్కూల్ బస్సులో మద్యం తరలింపు

కామేపల్లి: మండలంలోని పండితాపురానికి చెందిన నాగండ్ల పిచ్చయ్య ఓ స్కూల్ బస్‌లో మద్యం సీసాలు తరలిస్తూ ఎక్సైజ్ పోలీసులకు సోమవారం పట్టుబడ్డాడు. దీంతో ఆయనను తహసీల్దార్ సుధాకర్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.

కాలుజారి పడి వ్యక్తి మృతి

ఖమ్మంక్రైం: కూలి పనులకు వచ్చిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటన ఖమ్మంలో సోమవారం చోటు చేసుకుంది. రఘునాథపాలెం మండలం రేగులచెలకకు చెందిన కొర్లపాటి జోజీ కూలి పని నిమిత్తం ఖమ్మం వచ్చాడు. స్థానిక చెరువు బజార్‌లో ఓ పాత భవనంపై పేరుకుపోయిన చెత్త తొలగిస్తుండగా కాలు జారి భ వనంపై నుంచి పడ్డాడు. దీంతో అప్రమత్తమైన ఇతర కూలీలు భవన యజమానికి సమాచారం ఇచ్చి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆయన భార్య కరుణ ఫిర్యాదులో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం వన్‌టౌన్ సీఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

భూపంచాయితీలో దంపతులపై దాడి

నేలకొండపల్లి: భూపంచాయితీ నేపథ్యాన తమపై దాడి చేశారంటూ దంపతులు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురానికి చెందిన నెల్లూరి రామకృష్ణ భూసంబంధిత అంశంపై ల్యాండ్ సర్వేయర్‌ను ఆశ్రయించాడు. దీంతో సోమవారం సిబ్బంది సర్వేకు వచ్చారు. ఈక్రమంలో రామకృష్ణ, భార్య వాణి పరిశీలిస్తుండగా సమీపంలోని రైతు వీరితో వాగ్వాదానికి దిగాడు. అంతేకాక రామకృష్ణ, రెండు నెలల గర్భిణి అయిన ఆయన భార్యపై దాడి చేశారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మూడో కాన్పులోనూ ఆడపిల్ల.. ఆపై అమ్మకం?

- ఐసీడీఎస్ అధికారుల ప్రమేయంతో తిరిగి తీసుకొచ్చిన తల్లిదండ్రులు
- అంగన్‌వాడీ కార్యకర్తే బయటకు చెప్పిందంటూ గొడవ

తిరుమలాయపాలెం: అన్ని రంగాల్లో ఆడపిల్లలు రాణిస్తున్న ఈ తరుణంలోనూ పెంచే శక్తి లేకనో.. మరేదైనా కారణమో తెలియదో కానీ తల్లిదండ్రులే తమ పాప చనిపోయినట్లుగా తప్పుడు సమాచారం ఇచ్చి అమ్మేసినట్లు తెలుస్తోంది. అయితే, ఆశా కార్యకర్త, అంగన్‌వాడీ కార్యకర్తకు అందిన సమాచారంతో ఆరా తీయగా ఈ విషయం బయటపడగా, అధికారులు మందలించడంతో వారు తమ బిడ్డను తిరిగి తెచ్చుకున్నారని ప్రచారం జరుగుతోంది. వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం మేకలతండాకు చెందిన ఓ గిరిజన దంపతులకు గతంలో ఇద్దరు అమ్మాయిలు ఉండగా, బాబు కోసం ఎదురుచూశారు. అయితే, గత మార్చిలో జరిగిన మూడో కాన్పులోనూ ఆమె ఆడపిల్లకు జన్మనిచ్చింది. ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రసవం జరిగినట్లు తెలుస్తుండగా ఆడ శిశువు అని తెలియగానే ఆస్పత్రి సిబ్బంది సహకారంతో మహబూబాబాద్ జిల్లాలోని ఓ కుటుంబానికి అమ్మేసినట్లు సమాచారం. కాగా, బిడ్డను తీసుకున్న వారు ఈ దంపతులకు బంధువులేనని తెలుస్తోంది. ఆపై శిశువు పుట్టుకతోనే చనిపోయిందని ఆశా కార్యకర్తకు తప్పుడు సమాచారం ఇవ్వడమేకాక అంగన్‌వాడీ కేంద్రంలో మాత్రం తల్లీబిడ్డ పేరిట పౌష్టికాహారం తీసుకుంటున్నారని సమాచారం. అయితే, ఆనోటఈనోట విషయం బయటకు రావడంతో ఆశా కార్యకర్త వెళ్లి పాప మరణ ధృవపత్రం కావాలని అడగడం.. అంతేకాక అంగన్‌వాడీ కార్యకర్తకు సైతం తెలియడంతో ఆమె ఐసీడీఎస్ అధికారులకు చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో వారు పాప తల్లిదండ్రులకు ఫోన్ చేసి తమ కార్యాలయానికి రావాలని పట్టుబట్టగా పాపను అమ్మిన విషయం తెలిసిపోయిందనే భయంతో అమ్మేసిన పాపను రప్పించి ఐసీడీఎస్ అధికారుల వద్దకు వెళ్లినట్లు సమాచారం. ఈ క్రమంలోనే పాప అమ్మకం విషయాన్ని అధికారులకు ఎందుకు చెప్పావంటూ తల్లిదండ్రులు, వారి బంధువులు అంగన్‌వాడీ కార్యకర్తను దుర్భాషలాడుతూ ఇక్కడ ఉద్యోగం ఎలా చేస్తావో చూస్తామంటూ బెదిరించినట్లు తెలిసింది. ఈ విషయమై ఐసీడీఎస్ అధికారులను వివరణ కోరగా పూర్తిస్థాయిలో విచారణ చేపట్టడంతో పాపను తల్లిదండ్రులు పెంచుకునేలా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

9వ తరగతి విద్యార్థి అదృశ్యం



వివియన్

ఖమ్మంఅర్బన్: ఖమ్మం కైకొండాయిగూడెం రైల్వే కాలనీకి చెందిన 9వ తరగతి విద్యార్థి చింతమళ్ల వివియన్ కానరాకుండా పోయాడని ఆయన తండ్రి కరుణాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నగరంలోని ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న ఆయనను ఆదివారం ఉదయం కుటుంబసభ్యులు మందలించడంతో అలిగి వెళ్లిపోయాడు. ఎక్కడా వెతికినా ఆచూకీ లేకపోవడంతో వివియన్ తండ్రి సోమవారం చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు.

చింతకాని మండలంలో ఒకరు..

చింతకాని: మండలంలోని నాగిలిగొండ గ్రామానికి చెందిన నారగాని లింగయ్య అదృశ్యమైన ఆయన కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కూలీ పనులు చేసే లింగయ్య గతనెల 19న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని, ఎక్కడ వెతికినా ఆచూకీ లభించ లేదని ఆయన భార్య రాధమ్మ పోలీసులను ఆశ్రయించింది. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కార్లలో ప్రయాణం.. రూ.లక్షల్లో నగదు

పేకాట ఆడుతున్న పది మంది అరెస్ట్

ఖమ్మంఅర్బన్: ఖమ్మం సాయినగర్‌లోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో ఆదివారం రాత్రి తనిఖీ చేపట్టిన ఖమ్మం అర్బన్(ఖానాపురం హవేలీ) పోలీసులు పది మందిని అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.11లక్షల మేర నగదుతో పాటు వీరు వచ్చిన కార్లను సైతం స్వాధీనం చేసుకోగా వివరాలను సీఐ భానుప్రకాష్ సోమవారం వెల్లడించారు. సాయినగర్‌లోని చెరుకుమల్లి శ్రీనివాసరావు ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, ఖమ్మం అర్బన్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యాన దాడులు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకుడైన చెరుకుమల్లి శ్రీనివాసరావుతో పాటు ఖమ్మం, ఇల్లెందు, కారేపల్లి, రఘునాథపాలెం ప్రాంతాలకు చెందిన వ్యాపారులు, కాంట్రాక్టర్లు కొలేటి ఓంప్రకాష్, ఓరుకొండ ధనుంజయ్, లకావత్ బాబు, హుస్సేన్, దాట్ల జగన్నాథం, వంగూరి శ్రీనివాసరావు, బొల్లెడు నిరంజన్, అల్లం రమేష్, బోడ రవికుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.11,30,670 నగదు, మూడు కార్లు, పది మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కాగా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు.

నీటి తూములో ఇరుక్కుని వ్యక్తి మృతి

మధిర: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తు జారి నీటిలో పడి తూములో ఇరుక్కోగా ఊపిరి ఆడక మృతి చెందాడు. మధిరలోని వైరా నది పరిధిలో సోమవారం ఈ ఘటన జరిగింది. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడుకు చెందిన పోశెట్టి రమేష్(42) వ్యక్తిగత పనిపై ద్విచక్ర వాహనంపై మధిరకు రాగా, తిరుగు ప్రయాణంలో శ్రీ మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద వైరా నదిలో తాత్కాలికంగా ఏర్పాటుచేసిన మట్టి రోడ్డుపై బయలుదేరాడు. అదే సమయంలో నదిలో నీటి ప్రవాహం పెరగగా, ప్రమాదవశాత్తు జారి పడిన ఆయన అక్కడి తూములో ఇరుక్కున్నాడు. సమీపంలో ఉన్న వారు ఈ విషయాన్ని గమనించి ఆయనను కాపాడేందుకు యత్నిస్తుండగానే తూములో నుంచి బయటకు వచ్చాడు. కొన ఊపిరితో ఉన్న రమేష్‌ను కాపాడే ప్రయత్నం చేస్తుండగా ఊపిరాడక మృతి చెందాడు. కాగా, మృతుడి భార్య రాజేశ్వరి విజయవాడ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తుండగా వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈమేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు మధిర టౌన్ పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి...

నేలకొండపల్లి: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మండలంలోని అమ్మగూడెం గ్రామానికి చెందిన గండు హరికృష్ణ(35) ఆదివారం పొలం వద్ద పురుగుల మందు తాగాడు. దీంతో గమనించిన కుటుంబీకులు ఆయనను నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స పొందుతూనే హరికృష్ణ సోమవారం మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. అయితే, ఆయన ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో యువకుడు...



తిమోతి (ఫైల్)

సత్తుపల్లిరూరల్: రోడ్డు దాటుతున్న ద్విచక్రవాహనదారుడిని లారీ ఢీకొట్టడంతో మృతి చెందిన ఘటన సత్తుపల్లి మండలం రామగోవిందాపురం వద్ద సోమవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా మల్లేశ్వరానికి చెందిన నంద్యాల తిమోతి(26) ద్విచక్రవాహనంపై సత్తుపల్లి మండలం గంగారం వచ్చాడు. ఇక్కడ పనులు ముగిశాక తిరిగి ఆయన మల్లేశ్వరం వెళ్తుండగా మేడిశెట్టివారిపాలెం వద్ద రోడ్డు క్రాస్ చేసే క్రమంలో రాజమండ్రి నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈఘటనలో తిమోతీకి తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య లావణ్య, ఓ కుమార్తె ఉన్నారు. ఈమేరకు సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఏడ్చిఏడ్చి కన్నీరు ఇంకిపోయాక...

- 15రోజుల తర్వాత స్వస్థలానికి విద్యార్థి మృతదేహం
- గతనెల 23న అమెరికాలో చిన్నకోరుకొండి వాసి మృతి



శ్రీనాథరాజు కిరణ్ మృతదేహం

కల్లూరురూరల్: కల్లూరు మండలం చిన్నకోరుకొండికి చెందిన విద్యార్థి శ్రీనాథరాజు కిరణ్(22) గత నెల 28న మృతి చెందగా ఆయన మృతదేహం సోమవారం స్వస్థలానికి చేరింది. దీంతో పదిహేను రోజులుగా ఆయన మృతదేహం కోసం అన్నపానీయాలు మాని ఎదురుచూస్తున్న తల్లి, కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా రోదించారు. కిరణ్ తండ్రి లక్ష్మణ్‌రాజు గతంలో మృతి చెందగా, ఆయన తల్లి హైదరాబాద్‌లో ఉంటోంది. ఇక కిరణ్ బాధ్యతలను తాత కృష్ణమూర్తిరాజు చూస్తున్నారు. కాగా, బీటెక్ పూర్తిచేశాక ఎంఎస్ నిమిత్తం అమెరికా వెళ్లిన కిరణ్ అక్కడ శ్యాండిల్ ఎస్ టౌన్‌లో ఈత కొలనుకు స్నేహితులతో కలిసి వెళ్లాడు. అయితే, ఈత రాకపోవడంతో నీళ్లలో మునిగిచనిపోగా.. కిరణ్ మృతదేహాన్ని అమెరికాలో ఉంటున్న జిల్లా వాసులు, ఆయన స్నేహితులు ఇక్కడకు పంపించారు. ఈమేరకు విమానంలో హైదరాబాద్ చేరుకోగా వాహనంలో సోమవారం మధ్యాహ్నం గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి, జెడ్పీటీసీ కట్ట అజయ్‌కుమార్, నాయకులు పసుమర్తి చందర్‌రావు, బూదాటి నారపరెడ్డి, నాగేశ్వరరావు, ఎస్.కే.తురాబ్‌అలీ, ఇనుముల రాములు తదితరులు పరామర్శించారు.

‘ఉచిత’ నాటకం!

ఏపీలో ఇసుక పేరుకే ఫ్రీ.. డబ్బులు సమర్పించుకోవాల్సిందే ● కూటమి సర్కారు తాత్కాలిక కొత్త విధానం తీరు ఇదీ..

- పన్నుల మోత, రవాణా చార్జీలు, నిర్వహణ ఫీజులు తడిసిమోపెడు
- ఇసుక కమిటీలపై పెత్తనమంతా పచ్చ నేతలదే
- రవాణా ముసుగులో తరలించి సొమ్ము చేసుకునే యత్నాలు
- దాదాపు 40 లక్షల టన్నులు గత 40 రోజుల్లో మాయం
- స్టాక్ పాయింట్ల వద్ద సగం నిల్వలను కొల్లగొట్టిన టీడీపీ నేతలు
- వర్షాకాల అవసరాల కోసం నిల్వ చేసిన గత ప్రభుత్వం
- జగన్ హయాంలో ఏటా ఖజానాకు రూ.780 కోట్ల ఆదాయం



విశాఖ జిల్లా అగనంపూడి వద్ద ఉచితంగా ఇసుక.. కానీ టన్ను ధర రూ.1,394గా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని టీడీపీ సర్కారు చెబుతున్న మాటలు మాయ నాటకాలని తేలిపోయింది! ఉచిత ఇసుక విధానాన్ని సోమవారం నుంచి అమల్లోకి తెస్తున్నట్లు ఆర్భాటంగా ప్రకటించినా స్టాక్ యార్డుల వద్ద మాత్రం ధరల పట్టికలు పెట్టడంతో వినియోగదారులు అవాక్కయ్యారు. కూటమి మేనిఫెస్టోలో ప్రకటించిన ఉచిత ఇసుక హామీకి స్టాక్ యార్డుల వద్ద పెట్టిన ధరల పట్టికలతో సీఎం చంద్రబాబు తూట్లు పొడిచారు. వర్షాకాలంలో కొరత లేకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇప్పటికే స్టాక్ పాయింట్లలో పెద్దఎత్తున ఇసుక నిల్వలు ఉంచింది. తాజాగా టీడీపీ సర్కారు దీన్ని ఉచితంగా సరఫరా చేస్తామని చెప్పినా అన్నిచోట్లా టన్నుకి నిర్దేశిత ధర చెల్లించాలని తేల్చి చెప్పడంతో ఇసుక కోసం వచ్చిన వారు కంగు తిన్నారు. చీరాల సమీపంలోని వేటపాలెం స్టాక్‌యార్డులో టన్ను ఇసుక రూ.675గా బోర్డు పెట్టారు. దీంతో ఉచితంగా ఇసుక తీసుకెళదామని ట్రాక్టర్లతో వచ్చిన పలువురు మోసపోయామని గ్రహించి వెనుతిరిగారు. అన్ని స్టాక్ యార్డుల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ప్రజలకు ఎలాంటి మేలు చేయని.. ఖజానాకు ఆదాయం సమకూరని తాత్కాలిక కొత్త విధానాన్ని కూటమి ప్రభుత్వం తెచ్చింది. దీనిల్ల అటు ప్రజలు, ఇటు ఖజానాకు నష్టం వాటిల్లుతుండగా టీడీపీ నేతలు మాత్రం జేబులు నింపుకునేందుకు మార్గం సుగమం అయింది. పేరుకు ఉచిత ఇసుక అని ప్రకటించినా ప్రజలు మాత్రం డబ్బులు కట్టాల్సిందే. ఇదే ఉచిత ఇసుక విధానంలోని ప్రత్యేకత. ఉచిత ఇసుక విధానం పేరుతో గనుల శాఖ ముఖ్య కార్యదర్శి యువరాజ్ సోమవారం జీవో ఎంఎస్ నెంబర్ 43 జారీ చేశారు. గత సర్కారు హయాంలో అమలైన విధానం స్థానంలో తాత్కాలికంగా ఉచిత విధానాన్ని అమల్లోకి తెస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో పారదర్శకంగా ఇసుక విక్రయాల ద్వారా ఏటా ప్రభుత్వ ఖజానాకు రూ.780 కోట్ల ఆదాయం సమకూరగా ప్రజలకు సులభంగా, అందుబాటు ధరలో లభ్యమయ్యేది. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ఖజానాకు ఒక్క రూపాయి ఆదాయం రాదు. మరోవైపు ప్రజలు డబ్బులిచ్చి మరీ ఉచిత ఇసుకను కొనుగోలు చేయాల్సిన అగత్యం దాపురించింది!

ఇదీ కొత్త విధానం..

జిల్లా స్థాయిలో కమిటీలు ఆయా రీచ్‌ల్లో ఇసుక ధరలను నిర్ణయిస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా ఎస్పీ, జేసీ, ఆర్డీఓ తదితర అధికారులతో ఈ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అన్ని జిల్లాల్లో ఇప్పటికే ఏర్పాటైన ఇసుక కమిటీలు తమ పరిధిలోని ఇసుక స్టాక్ యార్డులను స్వాధీనంలోకి తీసుకుని ధరలు నిర్ణయించాయి. సీనరేజి ఫీజు, ఇతర పన్నులు, తవ్వకం, లోడింగ్, రవాణా, ర్యాంపు నిర్వహణ, పరిపాలనాపరమైన ఖర్చులన్నీ లెక్కించి టన్ను ఇసుక ధరను నిర్ణయించారు. యార్డులకు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది లేదా వీఆర్‌ఓ, వీఆర్‌ఏలను ఇన్‌ఛార్జీలుగా నియమించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వినియోగదారులు స్టాక్ పాయింట్ల వద్ద నేరుగా ఇసుక కొనుగోలు చేయవచ్చని, తరలించేందుకు వారే లారీలు తెచ్చుకోవాలని సూచించారు. స్టాక్ పాయింట్లలో నగదు లావాదేవీలు కాకుండా డిజిటల్‌గా మాత్రమే డబ్బులు స్వీకరించే ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. త్వరలో ఇసుక కొనుగోలుకు సంబంధించి ఆన్‌లైన్‌లో పర్మిట్లు జారీ చేసే విధానం రూపొందిస్తామని తెలిపారు. జిల్లా స్థాయిలో ఇసుక ఆపరేషన్స్ పర్యవేక్షించడానికి ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ రూమ్, రాష్ట్ర స్థాయిలో మైనింగ్ డైరెక్టర్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ నిర్వహిస్తామని తెలిపారు. ఒక వ్యక్తి ఒక రోజుకు 20 టన్నుల ఇసుక మాత్రమే కొనుగోలు చేసేందుకు అవకాశం ఇస్తామన్నారు.

ఉసూరుమంటూ..

ఉచితంగా ఇసుక దొరుకుతుందని భావించిన నిర్మాణదారులు ఉదయాన్నే ట్రాక్టర్లలో స్టాక్ పాయింట్ల వద్దకు వచ్చి బారులు తీరారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల బోర్డులు చూసి విస్తుపోయారు. ఉచితంగా ఇసుక అందిస్తామని ఊరించి టన్నుల లెక్కన డబ్బులు కట్టాలని బోర్డులు ఏర్పాటు చేయటాన్ని చూసి ఉసూరుమంటూ వెళ్లిపోయారు. కొత్త ఇసుక విధానంలో బాపట్ల జిల్లా చీరాలలో ట్రాక్టర్ ట్రక్కు ఇసుక కొనుగోలు చేయాలంటే రూ.3,034 అవుతుంది. ఒక్కో ట్రాక్టర్‌లో 4.50 టన్నులు లోడింగ్ చేయవచ్చు. దీనికి రవాణా ఛార్జీలు మరో రూ.వెయ్యి చెల్లించాల్సి వస్తుంది. మొత్తంగా ట్రక్కు ఇసుక రూ.4 వేలు సమర్పించుకుని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

తిరిగి వెళ్లిపోతున్న వినియోగదారులు..

స్టాక్ పాయింట్ల వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు ఫ్లెక్సీతో రాష్ట్ర ప్రజలందరికి ఉచితంగా ఇసుక అని పేర్కొంటూ షరతులు వర్తిస్తాయి అనే మాదిరిగా టన్ను ఇసుక రూ.675 అని బోర్డులు పెట్టారు. అక్కడకు వచ్చిన వారంతా బోర్డులు చూసి ఈ ధరలకు కొనలేమని తిరిగి వెళ్లిపోతున్నారు. వేటపాలెం స్టాక్ పాయింట్‌కి మధ్యాహ్నం వరకు 20 ట్రాక్టర్లు రాగా అన్నీ ఖాళీగా తిరిగి వెళ్లిపోయాయి. ఒక్కరూ ఇసుక కొనుగోలు చేయలేదు. టీవీలు, పేపర్లలో ఇసుక ఉచితమన్న వార్తలు చూసి వచ్చామని.. కానీ ఇక్కడకు వచ్చాక తాము మోసపోయామని గుర్తించినట్లు పలువురు కొనుగోలుదారులు పేర్కొన్నారు.

రవాణా ముసుగులో దోపిడీకి స్కెచ్!

ఇసుకపై కొత్త విధానంలో ఉచితం అనేది ఒక మాయ కాగా రవాణా అనేది మరో సరికొత్త దోపిడీకి స్కెచ్‌గా కనిపిస్తోంది. రవాణా ముసుగులో ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకునేందుకు ప్రభుత్వ పెద్దలు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇసుకను తామే రవాణా చేస్తామనడం వెనుక ఉద్దేశం అదేనని భావిస్తున్నారు. వర్షాకాలంలో ఇసుక కొరతను అధిగమించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా స్టాక్ పాయింట్లలో నిల్వ చేసిన ఇసుకను అధికారం మారగానే కూటమి సర్కారు మాయం చేసింది. దాదాపు 40 లక్షల టన్నుల ఇసుకను గత 40 రోజుల్లో లెక్కాపత్రం లేకుండా ఎక్కడికక్కడ టీడీపీ నేతలు అమ్మేసుకున్నారు. అదే తరహాలో రవాణా పేరుతో ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు కొత్త విధానానికి రూపకల్పన చేశారు. పేరుకు జిల్లా కలెక్టర్ల నేతృత్వంలోని ఇసుక కమిటీలు అమ్మకాలను పర్యవేక్షిస్తాయని చెబుతున్నా స్థానిక టీడీపీ నేతలే ఇసుక వ్యవహారాలను నియంత్రించే పరిస్థితి నెలకొంది. తొలిరోజే రాష్ట్రవ్యాప్తంగా రీచ్‌లు, స్టాక్ పాయింట్ల వద్ద టీడీపీ నేతలు, కార్యకర్తలు హల్‌చల్ చేయడమే ఇందుకు ఉదాహరణ. ఉచితంగా ఇసుకను అందిస్తున్నామంటూ బ్యానర్లతో స్టాక్ పాయింట్ల వద్ద ర్యాలీలు నిర్వహిస్తూ హడావుడి చేశారు. దీన్నిబట్టి స్టాక్ యార్డులు ఎవరి చేతుల్లో ఉన్నాయో అర్థమవుతోంది. ఇప్పటివరకు జిల్లా ఇసుక కమిటీలు స్టాక్ పాయింట్ల వద్ద పూర్తిస్థాయిలో ఇన్‌చార్జీలను కూడా నియమించలేదు. యార్డుల్లో ఎంత ఇసుక ఉందో కచ్చితమైన సమాచారం అధికారుల వద్ద లేదు. వర్షాకాలం సీజన్ వరకు ఉచిత ఇసుక పేరుతో దోపిడీని కొనసాగించి ఆ తర్వాత పూర్తిస్థాయి విధానాన్ని తెచ్చే యోచనలో సర్కారు ఉన్నట్లు స్పష్టమవుతోంది

సగం ‘స్టాక్’స్వాహా

అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా ఇసుక స్టాక్ పాయింట్లను తమ అధీనంలోకి తెచ్చుకున్న టీడీపీ నేతలు ఇష్టానుసారం విక్రయించేశారు. వర్షాకాలంలో కొరత లేకుండా 80 లక్షల టన్నుల వరకూ ఇసుకను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిల్వ ఉంచింది. గత నెల 4వ తేదీ నుంచి అధికారం అండతో టీడీపీ నేతలు ఇసుక యార్డులను దౌర్జన్యంగా తమ అధీనంలోకి తెచ్చుకున్నారు. ఇసుక కాంట్రాక్టు సంస్థలైన జేసీకేసీ, ప్రతిమ ఇన్‌ఫ్రా ప్రతినిధులను బెదిరించి తరిమేశారు. ఇప్పటికే చాలా వరకూ ఇసుకను అమ్మేశారు. సుమారు 40 లక్షల టన్నుల ఇసుకను విక్రయించేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం 40 లక్షల టన్నుల ఇసుక మాత్రమే స్టాక్ యార్డుల్లో ఉందని గనుల శాఖ చెబుతోంది. అంటే మిగిలిన 40 లక్షల టన్నుల ఇసుకను టీడీపీ నేతలు నెలరోజుల్లోనే మింగేసినట్లు స్పష్టమవుతోంది.


వైఎస్సార్ ఘాట్ వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో వైఎస్ జగన్, వైఎస్ విజయమ్మ, వైఎస్ భారతి, కుటుంబ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నేతలు

వైఎస్సార్‌కు ఘన నివాళి

ఇడుపులపాయలో మాతృమూర్తి, సతీమణితో కలసి వైఎస్ జగన్ ప్రత్యేక ప్రార్థనలు

కష్టాలు కొద్దికాలమే... దేవుడి దయతో ధైర్యంగా ఎదిరిద్దాం

75వ జయంతి వేడుకలకు రాష్ట్రవ్యాప్తంగా పోటెత్తిన అభిమానులు, కార్యకర్తలు

సాక్షి కడప: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతిని పురస్కరించుకుని సోమవారం వైఎస్సార్ కడప జిల్లా ఇడుపులపాయకు జనవాహిని పోటెత్తింది. రాష్ట్రవ్యాప్తంగా తరలి వచ్చిన అభిమానులు వైఎస్సార్ ఘాట్ వద్ద ఘన నివాళులర్పించారు. ముందుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన మాతృమూర్తి వైఎస్ విజయమ్మ, సతీమణి వైఎస్ భారతీరెడ్డి, మేనత్త వైఎస్ విమలమ్మ, చిన్నాన్న వైఎస్ సుధీకర్‌రెడ్డి, అత్తమ్మ ఈసీ సుగుణమ్మ, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితో కలసి ఇడుపులపాయలో వైఎస్సార్‌కు నివాళులర్పించారు. సమాధి ఘాట్‌కు పూలమాలలు వేసి నివాళులర్పించిన వైఎస్ జగన్ కాసేపు అక్కడే మోకాళ్లపై కూర్చొని తండ్రిని స్మరించుకున్నారు. నివాళులర్పించే సమయంలో వైఎస్ విజయమ్మ భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు.

ప్రత్యేక ప్రార్థనలు..

సమాధి ఘాట్ వద్ద వైఎస్ జగన్, వైఎస్సార్ కుటుంబ సభ్యులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రానున్న కాలంలో కొన్ని సమస్యలు ఎదురైనా రాజశేఖరరెడ్డి స్ఫూర్తితో జగన్ ధైర్యంగా ఎదుర్కొనేలా దేవుడు ఆశీర్వదించాలని మేనత్త విమలమ్మ ప్రార్థన చేశారు. కష్టాలు తాత్కాలికమేనని, ఎన్ని ఇబ్బందులు వచ్చినా దేవుడి మీద భారం వేసి ముందుకు వెళ్లడం ద్వారా ఎదిరించే శక్తిని ప్రసాదిస్తాడని చెప్పారు. తెలుగు రాష్ట్రాల ప్రజలకు వైఎస్సార్, వైఎస్ జగన్ చేసిన మంచిని ప్రస్తావించారు.

వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులు..

ఇడుపులపాయలోని ఘాట్ ప్రాంగణంలో వైఎస్సార్ విగ్రహానికి వైఎస్ జగన్ పూలమాల వేసి నివాళులర్పించారు. కొద్దిసేపు అక్కడే నిలబడి వైఎస్సార్‌ను స్మరించుకున్నారు. వైఎస్ విజయమ్మ, వైఎస్ భారతిరెడ్డి, విమలమ్మ, వైఎస్ సుధీకర్‌రెడ్డి తదితరులు పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.

అందరికీ అభివాదం.. అభిమానులతో సెల్ఫీ

ఇడుపులపాయలో వైఎస్సార్ సమాధి ఘాట్ ప్రాంగణానికి తరలి వచ్చిన జనవాహినికి వైఎస్ జగన్ అభివాదం చేశారు. వైఎస్సార్ అమర్‌రహే, వైఎస్ జగన్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలతో ఘాట్ ప్రాంగణం హోరెత్తింది. పలువురి వద్దకు స్వయంగా వెళ్లి పలుకరించిన వైఎస్ జగన్ అడిగిన వారందరితో సెల్ఫీ దిగారు. భారీగా వచ్చిన ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. మూడు రోజుల జిల్లా పర్యటన ముగించుకుని అనంతరం అక్కడి నుంచి ఉదయం 11.10 గంటలకు గన్నవరం చేరుకున్న వైఎస్ జగన్‌కు విమానాశ్రయంలో పలువురు పార్టీ నేతలు ఘనస్వాగతం పలికారు. వారందరినీ ఆప్యాయంగా పలకరించిన వైఎస్ జగన్ రోడ్డు మార్గంలో తాడేపల్లికి బయలుదేరారు.

నాన్నా.. మీ పుట్టిన రోజు మా అందరికీ పండుగ రోజు

- కోట్లాది కుటుంబాలు మిమ్మల్ని జ్ఞాపకం చేసుకుంటున్నాయి
- తండ్రి వైఎస్ఆర్‌ను గుర్తుచేసుకుంటూ వైఎస్ జగన్ పోస్ట్

సాక్షి, అమరావతి: దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా ఆయన తనయుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఘన నివాళులర్పించారు. తన తండ్రి వైఎస్ఆర్‌ను గుర్తుచేసుకుంటూ వైఎస్ జగన్ సోమవారం ఎక్స్ (ట్విటర్)లో పోస్ట్ చేశారు. ‘నాన్నా మీ 75వ పుట్టిన రోజు మా అందరికీ పండుగ రోజు. కోట్లాది కుటుంబాలు ఇవాళ మిమ్మల్ని జ్ఞాపకం చేసుకుంటున్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు మీ పుట్టిన రోజున సేవా కార్యక్రమాల్లో ముందుకు సాగుతున్నారు. ప్రజా శ్రేయస్సు కోసం మీరు చూపిన మార్గం మాకు శిరోధార్యం. జీవితాంతం మీరు పాటించిన క్రమశిక్షణ, చేసిన కఠోర శ్రమ, రాజకీయాల్లో మీరు చూపిన ధైర్యసాహసాలు మాకు మార్గం. మీ ఆశయాల సాధనే లక్ష్యంగా, కోట్లాది కుటుంబాల క్షేమమే ధ్యేయంగా చివరి వరకూ మా కృషి కొనసాగుతుంది’అంటూ వైఎస్ జగన్ పోస్ట్ చేశారు.

జిల్లా వార్తలు

ఇంటి తలుపుపై మహానేత !

డోర్‌పై వైఎస్ బొమ్మ చెక్కించిన అభిమాని



ఇంటి గుమ్మం తలుపుపై ఉన్న వైఎస్ బొమ్మ వద్ద నివాళి అర్పిస్తున్న ఖలీల్ పాషా

పాల్వంచ: దివంగత మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి అంటే అతడికి ఎనలేని అభిమానం. ఆయనను గుర్తు చేసుకోని రోజంటూ ఉండదు. దీంతో నిత్యం కనిపించేలా తలుపుపై వైఎస్ బొమ్మ చెక్కించుకుని తన అభిమానాన్ని చాటుకున్నాడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని ఒడ్డుగూడెం ప్రాంతానికి చెందిన ఖలీల్ పాషా. ఇటీవలే కొత్త ఇల్లు నిర్మించుకోగా ప్రధాన ద్వారం తలుపుపై వైఎస్సార్ నిలువెత్తు బొమ్మను చెక్కించుకున్నాడు. సోమవారం మహానేత జయంతి సందర్భంగా ఆ బొమ్మ వద్దే నిల్చుని నివాళి అర్పించాడు. ఈ సందర్భంగా ఖలీల్ పాషా మాట్లాడుతూ వైఎస్ పాలన ఒక స్వర్ణ యుగమని, ఆయన హయాంలో పేదలకు ఎన్నో సంక్షేమ ఫలాలు అందాయని, ప్రతి ఒక్కరి హృదయాల్లో చిరస్మరణీయుడిగా ఉన్నారని అన్నారు.

ఇంజనీరింగ్‌లో సింగరేణి ఉద్యోగుల పిల్లలకు సీట్లు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, కార్మికుల పిల్లలకు జేఎన్‌టీయూ పరిధిలోని మంథని, కొత్తగూడెంలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్లు కేటాయించారు. కాగా, ప్రవేశాలకు గతనెల 30వరకు ఉన్న దరఖాస్తు గడువును ఈనెల 23వరకు పొడిగిస్తూ సోమవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. మంథని కళాశాలలోని వివిధ బ్రాంచ్‌ల్లో కార్మికుల పిల్లలకు 18, అధికారుల పిల్లలకు 18 సీట్లు కేటాయించగా, కొత్తగూడెంలోని ఇంజనీరింగ్ కళాశాలలోనూ పది సీట్లు కేటాయించారు. ఈమేరకు దరఖాస్తులను 23వ తేదీలోగా కార్పొరేట్ కార్యాలయానికి పంపించాలని సూచించారు.

గిరిజనేతర పోడుదారుల గోడు

యాభై ఏళ్లుగా పోడు సాగుతోనే జీవనాధారం

- అయినా ఏటా అటవీ అధికారుల వేధింపులు
- 21మందిపై ఐదేళ్లుగా కొనసాగుతున్న కేసులు
- కార్యాలయాల చుట్టూ తిరగలేక విసిగిపోతున్న సాగుదారులు


పోడురైతుల అరకలను అడ్డుకుంటున్న అటవీ ఉద్యోగులు (ఫైల్)


కారేపల్లి రేంజ్ కార్యాలయం ఎదుట నోటీసులతో పోడు రైతులు (ఫైల్)

కారేపల్లి: యాభై ఏళ్లకు పైగా తరతరాలుగా వారసత్వంగా వస్తున్న పోడుభూమిని సాగు చేసుకుంటున్న వారు కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఆనాడు వైఎస్.రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు గిరిజన పోడుదారులకు అటవీ హక్కు పత్రాలు ఇచ్చి ఆదుకున్నారు. కొన్నాళ్ల క్రితం ఇంకొందరికి సైతం బీఆర్‌ఎస్ ప్రభుత్వం అటవీ హక్కుపత్రాలు ఇచ్చింది. ఇంతవరకు బాగానే ఉన్నా ఖమ్మం జిల్లాలోని ఏజెన్సీ మండలమైన సింగరేణి పరిధిలోకి వచ్చే కారేపల్లి రెవెన్యూ గ్రామం మైదాన ప్రాంతంలో ఉంటుంది. దీంతో ఇక్కడ పోడు వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనేతరులకు హక్కులు దక్కకపోవడంతో ఏళ్లుగా అవస్థ పడుతున్నారు.

పోడు.. గోడు

గిరిజనేతర రైతులకు అటవీహక్కు పత్రాలు అందకపోగా, పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం గడిపే అవకాశం ప్రభుత్వాలు కల్పించాయి. కానీ వీరిపై అటవీ అధికారుల వేధింపులు మాత్రం ఆగడం లేదు. కారేపల్లి ఫారెస్టు బీట్ పరిధి 129 సర్వే నంబర్‌లో సుమారు 330 ఎకరాలు ఉండగా.. 170 ఎకరాల్లో గిరిజన, గిరిజనేతర పోడు రైతులు సుమారు 70ఏళ్ల నుంచి పోడు సాగుతో జీవిస్తున్నారు. ఇందులో అప్పాయిగూడెం, వెంకిట్యాతండా, భల్లునగర్‌తండా, బస్వాపురం, గుట్టకిందిగుంపు గ్రామాలకు చెందిన గిరిజన పోడు రైతులకు 100 ఎకరాల మేర వైఎస్.రాజశేఖర రెడ్డి హయాంలో హక్కు పత్రాలను అందజేశారు. మిగిలిన 70ఎకరాల్లో సుమారు 40మంది గిరిజనేతర పోడు రైతులు సాగు చేసుకుంటున్నా హక్కుపత్రాలు ప్రస్తావన రాలేదు. అయినా అప్పటి పాలకులు తాతాముత్తాతల నుంచి పోడు వ్యవసాయం చేసుకుంటున్న వారిని ఇబ్బంది పెట్టొద్దని మౌఖికంగా ఫారెస్టు అధికారులకు సూచించినా ఫలితం కానరావడం లేదు.


నోటీసులతో వేధింపులు

కారేపల్లి ఫారెస్టు బీట్ పరిధిలో 70ఏళ్లుగా పోడు సాగు చేసుకుంటున్న గిరిజనేతరులైన 21మందిపై ఫారెస్టు అధికారులు కేసులు నమోదు చేశారు. అంతేకాక ఏటా సీజన్ ప్రారంభంలో నోటీసులు ఇస్తూ తమ కార్యాలయానికి రావాలని సూచిస్తున్నారు. పాత కేసులు ఉన్నాయని నోటీసులు ఇవ్వడం, విచారణ పేరిట తిప్పుతుండడంతో వ్యవసాయ పనులు మానుకోవాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తమకు సైతం హక్కుపత్రాలు ఇవ్వాలని వారు కోరుతున్నారు.

ఏటా వేధింపులు

అటవీ ప్రాంతంలో హద్దులు నిర్ణయించాలని, ప్లాంటేషన్లను ఏర్పాటు చేయాలని అటవీ అధికారులు సిద్ధం కాగా.. 2017, 2019వ సంవత్సరాల్లో గిరిజనేతరులు పోడుభూముల్లో ట్రెంచ్‌లు కొట్టి వారిని అడ్డుకున్నారు. దీంతో పలుమార్లు ఉద్రిక్తత నెలకొనగా ప్రజాప్రతినిధులు, నాయకులు చర్చలు జరిపారు. ఆపై అఖిలపక్షం నాయకులు ఐదుగురు, 21మంది పోడుదారులపై ఫారెస్టు అధికారులు కేసులు నమోదయ్యాయి. ఇదిలా ఉండగా ఏటా పంటల సీజన్ ప్రారంభం కాగానే అటవీ అధికారుల వేధింపులు సర్వసాధారణం అయ్యాయని పోడు రైతులు ఆవేదన చెందుతున్నారు.


ఐదేళ్లుగా కేసులతో ఇబ్బందులు



ఫారెస్టు అధికారులు పెట్టిన కేసులతో ఐదేళ్లుగా ఇబ్బంది పడుతున్నాం. ఫారెస్టు ఆఫీసు చుట్టూ, కోర్టుల చుట్టూ తిరగలేక అవస్థ అవుతోంది. పోడు వ్యవసాయం చేసుకుని బతుకుతున్న మాపై పెద్దసార్లు కణికరం చూపించాలి. లేదంటే మా కుటుంబాలు వీధిన పడతాయి.

– పాసిన్ని నాగేశ్వరరావు, పోడు రైతు, కారేపల్లి

పోడు పట్టాలు ఇచ్చి ఆదుకోవాలి



తాతముత్తాతల నుంచి పోడు సాగు చేసుకుంటున్న మాపై ఫారెస్టు అధికారుల వేధింపులు ఆపాలి. గతంలో సర్వేనంబర్ 129లో గిరిజనేతర పోడు రైతులకు కొందరికి పట్టాలు ఇచ్చారు. ఆతర్వాత మళ్లీ పట్టించుకోలేదు. ఇకనైనా గిరిజనేతర పోడు రైతులను పట్టాలు ఇవ్వాలి.

– పాలిక చిన్నసారయ్య, పోడు రైతు, కారేపల్లి

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

ఖమ్మంమయూరిసెంటర్/భద్రాచలం టౌన్: తమిళనాడులోని అరుణాచలంలో గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల కోసం ఖమ్మం, భద్రాచలం డిపోల నుంచి సూపర్ లగ్జరీ బస్సులు నడిపిస్తున్నట్లు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ఏ.సరిరామ్, భద్రాచలం డీఎం బి.రామారావు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈ సర్వీసులు 19న రాత్రి బయలుదేరి 20వ తేదీన రాత్రి అరుణాచలం చేరుకుంటాయని వెల్లడించారు. మార్గమధ్యలో విజయవాడ మీదుగా శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం(గోల్డెన్ టెంపుల్) దర్శనం ఉంటుందని తెలిపారు. అక్కడ గిరి ప్రదక్షిణ పూర్తయ్యాక 21న సాయంత్రం బయలుదేరనున్న బస్సులు 22న సాయంత్రం ప్రారంభ స్థానాలకు చేరుకుంటాయని పేర్కొన్నారు. కాగా, ఖమ్మం నుంచి బయలుదేరే బస్సు(సర్వీస్ నంబర్ 64064)లో పెద్దలకు రూ.4,190, భద్రాచలం నుంచి బయలుదేరే బస్సు(సర్వీస్ 55555)లో టికెట్ చార్జీ రూ.4వేలుగా నిర్ణయించినట్లు తెలిపారు. సంస్థ వెబ్‌సైట్ లేదా బస్టాండ్ల రిజర్వేషన్ కౌంటర్లలో టికెట్లు బుక్ చేసుకోవచ్చని, రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచుతామని వెల్లడించారు. పూర్తి వివరాల కోసం ఖమ్మం డిపో మేనేజర్ 99592 25958, భద్రాచలం డిపో మేనేజర్‌ను 99592 25960 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

గిరిజనాభివృద్ధికి అధికారులు కృషి చేయాలి

ఐటీడీఏ పీఓ రాహుల్


గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలం: గిరిజనుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పరిష్కరించేలా అన్ని శాఖల అధికారులు సమష్టిగా కృషి చేయాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం గిరిజన దర్బార్ నిర్వహించగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల సమస్యలను పీఓ తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించడమే కాక సమస్యలు తెలుసుకోవాలన్నారు. ఆపై అర్హతల ఆధారంగా ప్రభుత్వ పథకాలు వర్తింపచేయాలని సూచించారు. ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, వివిధ శాఖల అధికారులు తానాజీ, రవీంద్రనాథ్, సురేష్‌బాబు, మునీర్‌పాషా, ఆర్.శ్రీనివాస్, అశోక్, భాస్కర్, ఆదినారాయణ, ప్రభాకర్‌రావు, నారాయణరావు, నరేష్, రమణయ్య, దుర్గయ్య, హరికృష్ణ సిబ్బంది పాల్గొన్నారు. కాగా, భద్రాచలం నియోజకవర్గంలోని ఆదివాసీ గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పీఓను కోరారు. గిరిజన దర్బార్‌కు వచ్చిన ఆయన పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు సీట్లు, గిరిజన గ్రామాల్లో రోడ్లు, స్థానికులకు జీవనోపాధి తదితర అంశాలపై పీఓ రాహుల్‌కు వినతిపత్రం అందజేశారు.

పోడు భూముల ఆక్రమణ ఆపాలని వినతి

భద్రాచలంటౌన్: భద్రాచలం ఏజెన్సీలో ఆదివాసీ గిరిజనులు ఏళ్లుగా పోడు సాగు చేసుకుంటుండగా అటవీ అధికారులు అడ్డుకుంటున్నందున తగిన చర్యలు తీసుకోవాలని న్యూడెమోక్రసీ నాయకులు కోరారు. ఈ సందర్భంగా భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్‌కు సోమవారం వారు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కలివేరు ప్రజలు 1980 నుంచి భూమి సాగు చేసుకుంటున్న భూముల్లో ఇటీవల అధికారులు మొక్కలు నాటుతామని బెదిరిస్తున్నారని తెలిపారు. ఈ విషయమై అటవీ అధికారుల దాడులు ఆపాలని కోరారు. నాయకులు ఆవునూరి మధు, గొని నాగేశ్వరావు, ముసలి సతీష్, జక్కుల రాంబాబు, ఇరప సమ్మక్క, ఆదిలక్ష్మి, రాజలక్ష్మి, మంగక్క తదితరులు పాల్గొన్నారు.

వరదల సమయాన విద్యుత్ అంతరాయం రావొద్దు


పర్ణశాల సబ్‌స్టేషన్‌లో అధికారులతో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి


భద్రాచలం సబ్‌స్టేషన్‌లో మొక్క నాటుతున్న సీఎండీ

- ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి
- పర్ణశాల, భద్రాచలం సబ్‌స్టేషన్లలో తనిఖీ

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో గోదావరికి వరద వచ్చినా సమీప ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భద్రాచలంలో సోమవారం పర్యటించిన ఆయన పట్టణంలోని విస్తా కాంప్లెక్స్ వద్ద పరిశీలించాక విద్యుత్ శాఖ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. వరద నీరు ఆగే ఆలయ ప్రాంగణం, విస్తా కాంప్లెక్స్ వద్ద విద్యుత్ అంతరాయం తలెత్తకుండా చూడాలని తెలిపారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ భద్రాచలం వచ్చే పర్యాటకులు, స్థానిక వినియోగదారులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆ తర్వాత గత ఏడాది వరదల సమయాన అధికారులు తీసుకున్న చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సీఎండీ పరిశీలించారు. కాగా,వన మహోత్సవంలో భాగంగా ఆయన భద్రాచలం కార్యాలయంలో మొక్క నాటారు.

సబ్‌స్టేషన్‌ను మార్చాలి

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండలం పర్ణశాలలో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు కేటాయించిన స్థలంలో పనులు ప్రారంభించాలని సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశించారు. వరద ముప్పు పొంచి ఉన్న పర్ణశాల సబ్‌స్టేషన్‌ను ఆయన పరిశీలించగా బండిరేవు గ్రామంలో కొత్త సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థలం కేటాయించామని తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. దీంతో సీఎండీ స్పందిస్తూ సబ్‌స్టేషన్ పనులు త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు. ఈకార్యక్రమాల్లో ఎస్‌ఈ బీకంసింగ్, డీఈలు జీవన్‌కుమార్, నందయ్య, శ్రీధరాచారి, రాంబాబు, ఏడీఈ వేణు, ఏఈ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.